క్లుప్తంగా

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



పనులు పరిశీలిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్ పేట, వెన్నంపల్లి గ్రామాల రైతులకు సాగునీరు అందించే డీ–83, ఉపకాలువ 22లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించే కార్యక్రమాన్ని శనివారం చేపట్టినట్లు మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తుందని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు రమేశ్, రామచంద్రం, శ్రావణ్, సురేశ్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఆరోవార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య శనివారం ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రాజమల్లు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గణిత పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రామచంద్రం, మల్లాల మోడల్ స్కూల్‌కు చెందిన సహస్రవర్షిణి, వేదప్రియ రాష్ట్రస్థాయి గణిత పోటీలకు ఎంపికయ్యారు. కాగా శనివారం ఎంఈవో మహేశ్ విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం సత్యనారాయణ, గణిత గైడ్ టీచర్ పోచయ్య ఉన్నారు.

ఆయిల్‌పామ్ పంట పరిశీలన

రామగిరి: మండలంలోని వేగ్లల్ ఫహాడ్ గ్రామంలో సోలార్ విద్యుత్‌తో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటలను శనివారం మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ పరిశీలించారు. ఆయిల్‌పామ్ పంటతో పాటు అంతర పంటలుగా సాగు చేసిన కొత్తిమీర, సరుగుడు, గోంగూరను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఉద్యానవన అధికారి జ్యోతి, ఏఈవో నవీన్, ప్రీతం, రైతులు వేణు, శంకర్ ఉన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న వీహెచ్ఆర్ సభ్యులు

గోదావరిఖనిటౌన్: వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి కుమారుడి జన్మదినం సందర్భంగా స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి మేకల డార్విన్‌కు ఆర్థికసాయం అందించారు. ఫౌండర్ తండ్రి అయిన వ్యాళ్ల రామిరెడ్డి చేతుల మీదుగా శనివారం రూ.36వేలు అందజేశారు. వీహెచ్ఆర్ ఫౌండేషన్ సాయం ఎంతో విలువైందని, మంచి డాక్టర్‌గా రాణించి రామగుండం నియోజకవర్గ ప్రజలకు మంచి పేరు తీసుకొస్తానని డార్విన్ పేర్కొన్నారు. ఫౌండర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సిగిరి రాము ఉన్నారు.

పార్టీ పటిష్టత కోసం పనిచేయాలి

సుల్తానాబాద్: బీజేపీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేస్తున్నట్లు పార్టీ జిల్లా ప్రముఖ్ పోచం అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో బూత్ అధ్యక్షుడిగా దేశెట్టి సాయికుమార్‌కు శనివారం నియామక పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటినుంచే బలోపేతం కావాలని సూచించారు. జిల్లా నాయకులు నాగరాజు, శిలారపు పర్వతాలు, సంపత్‌రావు, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు వనజ, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కూకట్ల చంద్రకళ, నాయకులు ఎనగందుల సతీశ్, గజబీంకార్ పవన్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లిలో రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల ప్రథమ సంవత్సర వైద్య విద్యార్థులు శనివారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే నిర్వహించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు ఆదేశాల మేరకు ప్రతీనెల ప్రజల ఆరోగ్యస్థితి తెలుసుకుంటూ వారికి వైద్య సలహాలు ఇస్తున్నారు. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, కావ్యరాసన్, ప్రేమలత, నాగరాజులు, కమాన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మంథని: రామానుజన్ చిత్రం వేస్తున్న విద్యార్థులు



ఫెర్టిలైజర్‌సిటీ: విద్యార్థులతో ఎంఈవో విమల



ధర్మారం: ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఉపాధ్యాయులు



జ్యోతినగర్: విద్యార్థికి బహుమతి అందిస్తున్న హెచ్ఎం జయరాజు



ఓదెల: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో ఎర్ర రమేశ్



కమాన్‌పూర్: పోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

ఘనంగా గణిత దినోత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ/కమాన్‌పూర్/జ్యోతినగర్/ఓదెల/ధర్మారం/మంథని/సుల్తానాబాద్‌రూరల్/జూలపల్లి/యైటింక్లయిన్‌కాలనీ: జిల్లావ్యాప్తంగా గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం గణిత దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీనివాస రామానుజన్ ఆవిష్కరణల గురించి మ్యాథ్స్ ఎగ్జిబిషన్స్, రంగోలి కాంపిటీషన్లు నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి అందజేశారు. విద్యార్థులు తయారు చేసిన మ్యాథ్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.

ఒత్తిడిని దూరం చేసే శక్తి ధ్యానానికి ఉంది

పెద్దపల్లిరూరల్: ఒత్తిడి నుంచి దూరం చేసే శక్తి కేవలం ధ్యానానికి మాత్రమే ఉందని ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటీ బీఈడీ కళాశాలలో శనివారం జరిగిన అంతర్జాతీయ ధ్యాన దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలను అభినందించారు. బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ బుర్ర తిరుపతి, హరి, దిలీప్‌శర్మ, మధుకర్, తిరుపతి, రమేశ్, సుజాత, అనురాధ, జ్యోతి, సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత



ధర్మారం: ధ్యానం చేయిస్తున్న ప్రశిక్షకులు

ధర్మారం: ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పతంజలి యోగా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు జంగిలి సుధాకర్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆయుష్ ఆరోగ్య యోగా మందిరంలో ప్రశిక్షకులు సదాకర్, మంజుల ఆధ్వర్యంలో శనివారం వేడుకలు నిర్వహించారు.

ఆకట్టుకున్న ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పలు ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాల్ ఇన్ ద బాస్కెట్, బాంబ్ ఇన్‌ది సిటీ, లెమన్ స్పూన్ రన్, గ్లాస్ పిరమిడ్, రన్నింగ్ రేస్, బెలూన్ బ్లాస్ట్, తదితర పోటీలు నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌లతో భయాందోళనకు గురవుతున్నాం

గోదావరిఖని: సింగరేణి జీడీకే–5 ఓసీపీ బ్లాస్టింగ్‌లతో భయాందోళనకు గురవుతున్నామని దళితహక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల దినేశ్, నాయకులు ఎర్రల రాజయ్య, ఎంఏ గౌస్ అన్నారు. జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. బ్లాస్టింగ్ తీరు మార్చుకోకపోతే గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. ప్రతీరోజు మధ్యాహ్నం మూడున్నర నుంచి 4 వరకు ప్రజలు బ్లాస్టింగ్ సమయాల్లో ఇళ్ల నుంచి బయటికి వెళ్తున్నారన్నారు. వాతావరణ కాలుష్యం ఏర్పడి అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రభావిత ప్రాంతమైన 33వ డివిజన్ ప్రజలకు ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. బ్లాస్టింగ్ తీరు మార్చుకోకపోతే స్థానిక ప్రభావిత ప్రాంతాల ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలరించిన ఫుడ్ కార్నివాల్ అండ్ గేమ్ ఎక్స్‌పో



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఫుడ్ కార్నివాల్ అండ్ గేమ్ ఎక్స్‌పో విజయవంతంగా నిర్వహించారు. ఫుడ్ కార్నివాల్‌ను ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ ప్రారంభించారు. విద్యార్థులు గేమ్ ఎక్స్‌పోతో పాటు సరికొత్త గేమింగ్ టెక్నాలజీని ప్రదర్శించడం, మెదడుకు పదును పెట్టే పోటీలు ప్రదర్శించారు. పట్టణం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, సందర్శకులు హాజరయ్యారు. అకౌంట్ ఆఫీసర్ పడాల పవన్‌కుమార్, అకాడమిక్ ఇన్‌చార్జి ఇజాజ్ ఖాన్, విభాగాధిపతులు శశికాంత్, అనిల్ భరత్, హర్షియా, అధ్యాపకులు, నవ్య, దీపిక, శ్రావణి, కార్తీక్, రమేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలోని కొన్ని యూనియన్లు కాంట్రాక్టు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్జీ–3 ఏరియా ఇన్‌చార్జి ఉడుత శంకర్‌యాదవ్ అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ శ్రీపాద భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో కాంట్రాక్టు కార్మికులు లేరని గత ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఆర్జీ–3 ఏరియాలో సుమారు 70శాతం మంది కాంట్రాక్టు కార్మికులు ఐఎన్‌టీయూసీ పక్షాన ఉన్నారన్నారు. మహిళా ఇన్‌చార్జి శ్రీమతి రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ బండ కిరణ్‌రెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ మల్లారెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, రాజేశం, శ్రీనివాస్, శ్రీకాంత్, శంకర్, బానేష్, నవీన్, సతీశ్, ఒర్రె మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కమాన్‌పూర్: మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. కరీంనగర్‌కు చెందిన మెడికేర్ ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆర్ఎస్‌పీ రెడ్డి, గజవెల్లి గణేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్, శ్రీనివాస్, మల్లారపు అరుణ్ పాల్గొన్నారు.

• తహసీల్దార్‌కు సన్మానం

రామగుండం: ఇటీవల అంతర్గాం మండలానికి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన తూం రవీందర్‌ను పెద్దపల్లి ఆర్డీవోతో పాటు కార్యాలయ సిబ్బంది శనివారం సన్మానించారు.

• అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ధర్మారం: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు.

• అక్రమంగా అరెస్టు చేయడం సరికాదు

గోదావరిఖని: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని చలో ఇందిరాపార్క్ కార్యక్రమానికి వెళ్తున్న తమను అరెస్ట్ చేయడం అన్యాయమని సీఐటీయూ నాయకులు కుమారస్వామి, వై.యాకయ్య అన్నారు. కార్మికులను హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారన్నారు.

• స్పిన్నింగ్ మిల్లు భూములను పరిరక్షించాలి

రామగుండం: అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు భూముల్లో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తుండడంపై శుక్రవారం బర్మా, కాందిశీకుల సంఘం అధ్యక్షుడు జెమ్ముల రామారావు జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తక్షణమే టెక్స్‌టైల్, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి స్పిన్నింగ్ మిల్లు భూములను పరిరక్షించాలని కోరారు.

• ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

కమాన్‌పూర్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 27 వరకు నిర్వహించే కళా నాయకుల కవాతు కార్యక్రమానికి వర్గాల ప్రజలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని ఆయన కోరారు. కుక్క రవీందర్, ఆవునూరి ఓదెలు, దామెర దేవయ్య పాల్గొన్నారు.

• ఎస్‌బీఐ బీమా చెక్కు అందజేత

ముత్తారం: మండలంలోని మచ్చుపేటకు చెందిన మృతుడు కోట శ్రీనివాస్ కుటుంబానికి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మంజూరైన రూ.5లక్షల బీమా చెక్కును శనివారం ఆ కంపెనీ పెద్దపల్లి డివిజన్ మేనేజర్ మెల్ల మురళీమోహన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి అందజేశారు. మృతుడు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ.50వేల ప్రీమియం స్మార్ట్‌స్కాలర్ పాలసీని తీసుకున్నాడు. శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. మృతుడి భార్య మంజులకు చెక్కు అందజేశారు.

• ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి

సుల్తానాబాద్: మున్సిపల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ జోనల్ అసిస్టెంట్ మేనేజర్ ఫార్మాచారి అన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం ఇందిరమ్మ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ తదితరులు ఉన్నారు.

• ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు 21రకాల వంటకాలు తీసుకొచ్చి ప్రదర్శించారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మద్రిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ ఆహారోత్సవ వేడుకలు నిర్వహించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని ఐతరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు.

• సీపీఐ నాయకుల నిరసన

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ అంబేడ్కర్‌పై బీజేపీ నేత అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో సీపీఐ నాయకులు శనివారం నిరసన తెలిపారు. కమాన్‌పూర్ మండలశాఖ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు.

• అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

మంథని: చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న మున్సిపల్ కార్మికులను శనివారం మంథని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గణేశ్ తెలిపారు.

• కేరళ ప్రజలకు అండగా నిలబడదాం

గోదావరిఖని: కేరళ ప్రజల హక్కులకు అండగా నిలబడదామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. శనివారం స్థానిక శ్రామికభవన్‌లో మాట్లాడారు. నాయకులు బిక్షపతి, శ్రీనివాస్, రామాచారి, జ్యోతి, రవీందర్, బూడిద గణేశ్ పాల్గొన్నారు.

గాయత్రి విద్యానికేతన్‌లో మ్యాథ్స్ ఎక్స్‌పో



విద్యార్థుల గణిత ప్రదర్శన

పెద్దపల్లిరూరల్: ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో మ్యాథ్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరెస్పాండెంట్ రజనీ దేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 200కుపైగా గణిత నమూనాలు తయారుచేసి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ విజయ్, టీచర్లు ఉన్నారు.

ఓదెలలో చోరీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామానికి చెందిన రాపల్లి రాజయ్య ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. బాధితుడు రాజయ్య, ఎస్సై అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజయ్య దంపతులు ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరూ లేనిసమయాన్ని చూసిన దొంగలు.. గోడపై నుంచి లోనికి దూరారు. ఇంటి దర్వాజాకు వేసిన తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తెరచి నాలుగు తులాల బంగారం తోపాటు రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై అశోక్‌రెడ్డి, క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసునమోదు చేసుకొన్నారు. కాగా, రహదారి సమీప ఇంట్లోనే, అదికూడా పట్టపగలే దొంగతనం చోటుచేసుకోవడంతో గ్రామస్తులు భయపడుతున్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లా క్రీడా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్‌తో రోహిత్ వర్మ, బాల్‌రాజ్

జ్యోతినగర్: సీఎం కప్ క్రీడా పోటీల్లో ఎన్టీపీసీ విశ్వభారతి విద్యార్థి రోహిత్ వర్మ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సీఎం కప్ జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో రోహిత్ వర్మ 600 మీటర్ల పరుగుపందెంలో విజేతగా నిలిచాడు. ఈనెల 30న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రోహిత్ వర్మ, ద్వితీయ స్థానంలో నిలిచిన పెద్దపల్లికి చెందిన బాల్‌రాజ్ పాల్గొంటారని పేర్కొన్నారు. రోహిత్ వర్మను డీవైఎంవో సురేశ్, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ అభినందించారు.

సింగరేణి వార్తలు

కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని: కొత్తగనులు వస్తేనే సింగరేణికి మనుగడ సాధ్యమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆర్జీ–1 పరిధిలోని జీడీకే–11గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన రూ.33వేల కోట్ల బకాయిలు ఇప్పించాలన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. పాతగనులు మూతపడుతున్నాయని, కొత్త గనులు రావాల్సి ఉందన్నారు. ఎంఎండీఆర్ చట్టంతో సింగరేణికి కొత్త గనులు రావడం లేదని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, సిద్ధమల్ల రాజు, నాయిని శంకర్, గొడిశెల నరేశ్, మానాల శ్రీనివాస్, చెప్యాల భాస్కర్, గడ్డం బాలు, తాళ్లపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగికి నగదు పురస్కారం



నగదు పురస్కారం అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని: ఐఈడీ విభాగంలో పనిచేస్తూ విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన రాంసాగర్ అనే జనరల్ మజ్దూర్‌ను శనివారం అభినందించారు. జీఎం కార్యాలయంలోని ఎస్‌వోటూ జీఎం చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాముడు నగదు బహుమతి అందజేశారు. ఏరియాకు సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు ఎప్పటికప్పుడు అందిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాంసాగర్ పనితీరును ప్రశంసించారు. ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ ఉన్నారు.

పర్యావరణ గృహాలంకరణ పోటీలు



గృహాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

రామగిరి: సింగరేణి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సెంటినరికాలనీ, యైటింక్లయిన్‌కాలనీలో నివసిస్తున్న ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల ఉద్యోగుల గృహాలను ఉత్తమ పర్యావరణహిత గృహాల ఎంపిక కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ పోటీలకోసం ముందుగా నమోదు చేసుకున్న గృహాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీ కన్వీనర్ గుంజపడుగు రఘుపతి మాట్లాడుతూ సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ఉద్యోగుల కుటుంబాల్లో అవగాహన పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేయబడిన వారికి 23న సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కమిటీ సభ్యులు పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, డీపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జీఎం రాముడు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో సింగరేణి సంస్థ ముందుంటుందని ఆర్జీ–2ఏరియా ఎస్‌వోటూ జీఎం రాముడు అన్నారు. ఆర్జీ–2 ఏరియా సింగరేణి ప్రభావిత గ్రామమైన 19వ డివిజన్ న్యూమారేడుపాకలో శనివారం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి సంస్థ ఉత్పత్తితో పాటు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. వకీల్‌పల్లి గనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్పొరేటర్ తాళ్ల అమృత రాజయ్య, ఏఐటీయూసీ నాయకులు శ్యామ్‌సన్, డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, సింగరేణి డిస్పెన్సరీ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

జూలపల్లి: రైతులు బయో ఇన్‌పుట్స్ వాడడం ద్వారా నేల ఆరోగ్యం, పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ చేయొచ్చని బీసీఐ ప్రాజెక్టు ఏపీయూఎం మాధవి, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రలీల సూచించారు. మండలంలోని తేలుకుంటలో రైతులకు పంటల సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్, రమేశ్, రాజ్‌కుమార్, రాకేశ్, వనిత, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్యాం పాల్గొన్నారు.



సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న పూసాల రహదారి వెంబడి ఉన్న డ్రైనేజీ నిండిపోయి దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల ను పూడిక తీసి బ్లీచింగ్ పౌడ ర్ చల్లాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు. వారం వారం క్లీన్ చేయాల్సిన సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయాలని వారు విన్నవిస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500